క్లుప్తంగా

నేడు నాదెండ్లలో ఆడుదాం ఆంధ్రా ప్రారంభం

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో మంగళవారం 10.30 గంటలకు ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆటస్థలంలో ప్రారంభమౌతాయని ఎంఈవోలు ఆంజనేయులు, కృష్ణారెడ్డి చెప్పారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మండల ప్రత్యేకాధికారి బీజే బెన్నీ, ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, మండల స్థాయి ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు. ఖోఖో, క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు.

నేడే విప్పర్ల శివాలయంలో ఆరుద్రోత్సవం



రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామంలో వేంచేసి ఉన్న గంగా పార్వతీ సమేత వల్లభేశ్వరీ స్వామి ఆలయంలో మంగళవారం ఆరుద్రోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రాత్రి 8 గంటల నుంచి భజనా కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అర్ధరాత్రి 12 గంటలకు 12 కిలోల కర్పూరపు జ్యోతి ప్రజ్వలన చేస్తామన్నారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం వల్లభేశ్వరస్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహిస్తారన్నారు. బుధవారం ఉదయం 5 గంటలకు మంగళహారతి, ఆశీర్వచనాలతో కార్యక్రమం ముగుస్తుందన్నారు. భక్తులందరూ ఆరుద్రోత్సవంలో పాల్గొని స్వామికృపకు పాత్రులు కావాలన్నారు.

ఆకర్షణగా నిలిచిన క్రిస్మస్ ట్రీ



వినుకొండ(నూజెండ్ల) : వినుకొండ మున్సిపల్ కార్యాలయం ఎదురు గుంటూరు–కర్నూలు జాతీయ రహదారి పక్కన వందల సంవత్సరాల నాటి వేపచెట్టునే క్రిస్మస్ ట్రీగా లైట్లతో స్టార్లతో అలంకరించారు. ప్రధానరహదారి పక్కన ఉన్న ఈ చెట్టు అందరిని ఆకర్షిస్తుంది. ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

రైతులకు మెరుగైన సేవలు



శావల్యాపురం: శావల్యాపురం సొసైటీ పరిధిలోని రైతులకు మెరుగైన సేవలు అందించుతున్నామని సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య అన్నారు. సోమవారం స్థానిక సొసైటీ కార్యాలయ ప్రాంగణంలో ఎరువుల గోదాం పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గతంలో ఎన్నుడు జరగని చేయనటువంటి అభివృద్ధి పనులు సీఎం వైస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో రైతుల సహకారంతో అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజనులో 250 మెట్రిక్ టన్నులు యూరియా, 300 మెట్రిక్ టన్నులు డీఏపీ, కాంపెక్స్ ఎరువులు 500 మెట్రిక్ టన్నులు అమ్మకాలు జరిగినట్లు చెప్పారు. త్వరలో శావల్యాపురం, వేల్పూరు గ్రామాల్లో జనరిక్ మందుల దుకాణాలు ప్రారంభిస్తామన్నారు. ఆయనతో పాటు సీఈవో జాలాది నాగప్రసాదు, సొసైటీ సిబ్బంది రామాంజినేయులు రైతులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలు



ఈపూరు : మండలంలోని, కొండ్రముట్ల, వనికుంట గ్రామాల్లో సోమవారం పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. కొండ్రముట్ల గ్రామానికి చెందిన నలబోలు శివరామయ్య వరిపొలంలో ప్రయోగం నిర్వహించగా 38 బస్తాలు వస్తాయని, వనికుంట గ్రామానికి చెందిన బమ్మిసీడి శాంతయ్యకు చెందిన వరిపొలంలో 5''5 కొలతల విస్తీర్ణంలో వరి కంకులను నూర్పగా ఎకరానికి 35 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కార్యక్రమంలో జిల్లా ఏడీ శ్రీనివాసరావు, మండల ఎస్టీవో కె.నాగశ్రీనివాసరావు, ఏఈవో అప్పారావు, సిబ్బంది ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు బోధనలతో ప్రపంచమంతా శాంతిమయం

- క్రిస్మస్ మహోత్సవంలో పాల్గొన్న ఎంపీ లావు, ఎమ్మెల్యే గోపిరెడ్డి
- వేర్వేరు ప్రాంతాల్లో ఘనంగా లోకరక్షకుడి జన్మదిన వేడుకలు



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ లావు, ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: ఏసుక్రీస్తు బోధనలు పాటిస్తే ప్రపంచమంతా శాంతిమయం అవుతుందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని జీఎల్ఆర్ ఫంక్షన్ హాలులో రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల ఎజ్రా ఆధ్వర్యంలో క్రిస్మస్ మహోత్సవం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథులుగా హాజరైన ఇరువురూ నేతలు క్రిస్మస్ కేకును కట్‌చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ శత్రువులపట్ల కూడా ప్రతి ఒక్కరు ప్రేమ, క్షమాపణ, సహాయం చేసే గుణాలు కలిగి ఉండడం వల్ల సమాజంలో వివాదాలు, కక్షలు ఉండవని తద్వారా శాంతి నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో ముదిరాజు, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్లు ఇయం.స్వామి, పాలపర్తి వెంకటేశ్వరరావు, మైనార్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్‌బాష, యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి గంటెనపాటి గాబ్రియేలు, జిల్లా అధ్యక్షులు పడాల సాంబశివారెడ్డి, మండల సర్పంచుల సంఘ అధ్యక్షుడు చల్లా నారపరెడ్డి, మాజీ కౌన్సిలర్లు మాగులూరి రమణారెడ్డి, సయ్యద్‌బాజీ, మాడిశెట్టి మోహనరావు, హోలీవుడ్‌రఘు, వేముల శివ, సయ్యద్‌ఖాదర్‌బాష, షేక్ కరిముల్లా పాల్గొన్నారు.

ఏసు బోధనలు ఆచరణీయం

నరసరావుపేట ఈస్ట్: ప్రపంచ మానవాళికి క్రీస్తు యేసు బోధనలు ఆచరణీయమని సంఘకాపరులు తెలిపారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని క్రైస్తవ ప్రార్థనాలయాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు యేసు జననాన్ని స్తుతిస్తూ క్రైస్తవ ప్రార్థనా గీతాలను ఆలపించారు. ఆయా చర్చిలలో సంఘకాపరులు క్రీస్తు యేసు సందేశాన్ని అందించారు. స్టేషన్ రోడ్డులోని టౌన్ బాప్టిస్ట్‌చర్చి, లూథరన్ చర్చి, పరిశుద్ధ పాల్ చర్చి తదితర చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

నాదెండ్ల మండలంలో...

నాదెండ్ల: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా సోమవారం అన్ని చర్చిల్లో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆయా చర్చి పాస్టర్లు ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ విశిష్టతను వివరించారు. విద్యుత్ దీపాలతో చర్చిలను సుందరంగా అలంకరించారు. భారీ స్టార్స్, క్రిస్మస్ ట్రీలతో ఆయా కాలనీల్లో పండుగ వాతావరణం నెలకొంది. పురాతన చర్చిలైన కనపర్రు, చిరుమామిళ్ళ, తూబాడు, గొరిజవోలు, నాదెండ్ల, సాతులూరు, గణపవరంలో క్రైస్తవులతో చర్చిలు నిండిపోయాయి. సాయంత్రం ఏసుక్రీస్తు ప్రతిమను ఆయా గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. చర్చిల్లో చీరల పంపిణీతో పాటూ అన్నదానం నిర్వహించారు. గణపవరం హెబ్రోను ప్రార్థనా మందిరంలో ఫాస్టర్ యడ్లపల్లి రమేష్‌బాబు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అనంతరం పేదలకు నూతన వస్త్రాలు బహూకరించారు.

చిలకలూరిపేటలో..

చిలకలూరిపేటటౌన్: క్రీస్తు చూపినబాటలో ప్రతి ఒక్కరూ నడవాలని బెంగుళూరుకు చెందిన పాస్టర్ ప్యాటన్‌వన్యాబెసలేల్ చెప్పారు. పట్టణంలోని సాంబశివనగర్ సీయోను ప్రార్థనామందిరంలో సోమవారం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ప్రార్థనల్లో ముఖ్య అతిథిగా పాల్గొని క్రిస్మస్ సందేశం అందించారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని పట్టణంలోని అన్ని చర్చిలను శోభాయమానంగా అలంకరించారు. భావనరుషి నగర్‌లోని తండ్రి సన్నిధిలో బ్రదర్ బి.షాలేము రాజు, పురుషోత్తమ పట్నం బైపాస్‌రోడ్డులోని ఏసు క్రీస్తు దివ్యశాంతి నిలయంలో పాస్టర్ ఎన్.క్రిస్టర్ క్రిస్మస్ సందేశం ఇచ్చారు. తూర్పుమాలపల్లెలోని లూథరన్, చార్లెస్ కాన్వెంట్ ప్రాంగణంలో ఉన్న రోమన్ కెథలిక్ చర్చి, ఆదిఆంధ్ర కాలనీ తెలుగు బాప్టిస్ట్ చర్చి, సంజీవనగర్ లూథరన్‌చర్చి, ఎన్టీఆర్ కాలనీ, బ్యాంక్‌కాలనీ, నెహ్రూనగర్ తదితర చోట్ల ఉన్న ప్రార్థనాలయాల్లో భక్తులు వేలాదిగా పాల్గొని క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పండుగ సందర్భంగా అన్ని చర్చిలలో క్రిస్మస్ కేకులను కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కులమతాలకతీతంగా ఆత్మీయులను, మిత్రులను ఇళ్లకు ఆహ్వానించి విందులను ఏర్పాటు చేశారు.

రూరల్ పరిధిలో...

నరసరావుపేట రూరల్: క్రిస్మస్ వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. సంఘకాపరులు క్రిస్మస్ సందేశాన్ని అందించారు. యువతీ, యువకులు, చిన్నారులు క్రైస్తవ గీతాలను ఆలపించారు. రావిపాడులోని ఇందిరాప్రియదర్శిని కాలనీలో తెలుగు బాప్టిస్ట్ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో చర్చి ఫాస్టర్ కోట మోషక్ పాల్గొని క్రిస్మస్ సందేశాన్ని అందించాడు. కాలనీలో సాయంత్రం నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. చిన్నారులు, యువకులు ఉత్సాహంగా కోలాటంలో పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: క్రిస్మస్ పర్వదినం వేడుకలు మండలంలో అన్నీ గ్రామాల్లో క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రార్థనా మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఏసుక్రీస్తు జన్మదినాన్ని క్రిస్మస్ పర్వదినంగా జరుపుకున్నారు. ఉదయం 10 గంటలు నుంచి 2గంటల వరకు ప్రార్థన మందిరాల్లో మత భోదకులు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనా మందిరాలు విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శావల్యాపురంలో రిడెంప్షన్ విమోచన ప్రార్థన మందిరంలో దైవజనులు ఫాస్టర్ సిహెచ్ యెహెజ్కేలు మాట్లాడుతూ లోక రక్షణకే క్రీస్తు జన్మించినట్లు చెప్పారు. శాంతి పాప పరిహారం సర్వ మానవాళి రక్షణ కోసమే క్రీస్తు జన్మించారన్నారు. చిన్నారులు సంస్కృతిక కార్యక్రమాలు క్రీస్తు భక్తిగీతాలు అలపించారు. రిడెంప్షన్ ప్రార్థన మందిరంలో పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ప్రార్థన మందిరాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. ఈకార్యక్రమంలో దైవసేవకురాలు కస్తూరి, రాక్‌ప్రశాంత్, నిశాంత్, సోమేపల్లి వెంకటేశ్వర్లు, పద్మనాభుని హనుమంతరావు పాల్గొన్నారు.

నూజెండ్లలో...

వినుకొండ(నూజెండ్ల): మండల కేంద్రమైన నూజెండ్లతోపాటు పలుగ్రామాలల్లో క్రిస్‌మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నూజెండ్ల, తలార్లపల్లి, ర్వారం, పమిడిపాడు, కంభంపాడు, ములకలూరు, ప్వుడ, గ్రామాలతోపాటు అన్నీగ్రామాలల్లో చర్చిలల్లో ప్రత్యేక ప్రార్థనలు జరుపుకున్నారు. నూజెండ్ల ఎస్సీకాలనీ, ఎస్టీ కాలనీల్లో చిన్నారులు ప్రత్యేక గీతాలు ఆలపించారు. తలార్లపల్లి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ ఎలీషా ఆధ్వర్యంలో క్రిస్మస్‌వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పల్నాడు జిల్లా యువజన ప్రధానకార్యదర్శి లేళ్ల అంజిరెడ్డి, సర్పంచ్ గాలెం నాగేశ్వరరావు, తాడిపత్రి వెంకటేశ్వరరెడ్డిలు పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల : మండలంలో సోమవారం క్రిస్మస్ పండుగను క్రైస్తవ సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మండలంలో పలు గ్రామాలలో గల చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. చర్చిలలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ చెట్లు, క్రిస్మస్ తాత వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఫాస్టర్లు క్రిస్మస్ పండుగ విశిష్టత గురించి, ఏసుక్రీస్తు జననం వలన సమాజానికి కలిగిన ప్రయోజనములు గురించి వివరించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేకులను కట్ చేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం చర్చిలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలో రొంపిచర్లలో గల హోసన్నా మందిరం, ఏసుమహిమ ప్రార్థన మందిరం, సెయింట్ పాల్ లూథరన్ సీఎస్ఐ, ఏసు ప్రభు, వడ్లమూడివారి పాలెం గ్రామంలో గల ఏసుకృపా ప్రార్థన మందిరము, పలు గ్రామాలలో గల చర్చిలలో క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: లోక రక్షకుడు ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండుగ వేడుకలు మండలంలో అంబరాన్ని అంటాయి. ఆదివారం నుంచే పండుగ మండలంలో సందడి నెలకొంది. పలు మందిరాల వద్ద క్రీస్తు పుట్టిన సమయంలో క్రైస్తవ యువకులు కేక్‌లను కట్ చేశారు. హ్యాపీ క్రిస్మస్...మేరీ క్రిస్మస్ అంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తిమ్మాపురం, యడ్లపాడు, ఉన్నవ, ఉప్పరపాలెం, కొండవీడు, జగ్గాపురం, జాలాది, సందెపూడి, తుర్లపాడు, మైదవోలు, లింగారావుపాలెం, కారుచోల, మర్రిపాలెం, బోయపాలెం, సంగంగోపాలపురం, బుస్సీనగర్, చెంఘీజ్‌ఖాన్‌పేట, సొలస, కొత్త సొలస గ్రామాల్లోని చర్చిల్లో దైవ సేవకులు ప్రత్యేక ప్రార్థనలు ఏర్పాటు చేసి క్రిస్మస్ పర్వదిన విశేషాలు, పరిశుద్ధ గ్రంథంలోని దేవుని సందేశాన్ని బోధించారు. సోమవారం మధ్యాహ్నం తిరిగి చర్చిల్లో పండుగ ప్రార్థనలు కొనసాగాయి. చర్చిలన్నీ విశ్వాసులతో నిండి, బయట వరండాల్లోనూ కోలాహలంగా మారాయి. చర్చిల్లోనూ క్రిస్మస్ పురస్కరించుకుని సర్వాంగ సుందరంగా అలంకరణలు గావించారు. కొత్త రంగులు, రంగు రంగుల విద్యుత్ దీపాలతో చర్చిలు ధగధగలాడాయి. చిన్నారులు నూతన వస్త్రాల్లో ముస్తాబై చర్చిల్లో ఏర్పాటు చేసిన బాలయేసు జననం, క్రిస్మస్ ట్రీల వద్ద సెల్ఫీలు దిగుతూ ఆనందంగా గడిపారు. సాయంత్రం ఇతర మతస్తులను తమ ఇళ్లకు ఆహ్వానించి ఎవరికి వారే ప్రేమ విందును ఏర్పాటు చేశారు.



రావిపాడులో నిర్వహించిన కోలాటం ప్రదర్శన



నరసరావుపేటలో క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



గణపవరంలో హాజరైన భక్తులు



గణపవరంలో క్రిస్మస్‌సందేశాన్ని వినిపిస్తున్న పాస్టర్ యడ్లపల్లి రమేష్‌బాబు



శావల్యాపురంలో నూతన వస్త్రాలు వితరణ చేస్తున్న పాస్టర్ సిహెచ్ యెహెజ్కేలు



రొంపిచర్ల హోసన్నా మందిరంలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు



సందేశాన్నిస్తున్న డాక్టర్ పులుకూరి విజయసేన



సందేశం ఇస్తున్న పాస్టర్ ప్యాటన్ వన్యాబెసలేల్

ఏసుక్రీస్తు మార్గం అందరికీ ఆచరణీయం



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ(నూజెండ్ల): ఏసుక్రీస్తు ఆచరించిన మార్గం అందరికీ అనుసరణీయమని ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడు సోమవారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే పట్టణంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జయధ్వని ప్రార్థనామందిరం, సెయింట్ మార్కు లూథరన్ చ్చి, తెలుగుబాప్టిస్టు చర్చి, హోసన్నామందిరాలల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇమ్మానియేలు తెలుగు బాప్టిస్టు చర్చిలో పిలిప్ ఆధ్వర్యంలో దైవ సందేశం వినిపించారు. అనంతరం క్రైస్తవ సోదరులనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రభుత్వ అందరి కుటుంబాలల్లో శాంతి సౌభాగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. తెలుగు బాప్టిస్టు చర్చి నూతన నిర్మాణానికి 20 లక్షలు సొంత నిధులు అందజేస్తానని, భక్తుల సహకారంతో నూతనచర్చి నిర్మించుకోవలసి సూచించారు. క్రైస్తవ ఆస్థుల పరిరక్షణ కోసం శక్తివంచనలేకుండా కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చర్చి మిటీ సభ్యులు పాల్గొన్నారు.

మానవాళికి ప్రేమ మార్గం చూపిన ఏసుక్రీస్తు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు

చిలకలూరిపేట: ఏసుక్రీస్తు మానవజాతికి ప్రేమ మార్గాన్ని చూపడానికే అవతరించాడని... ఆయన జీవితం ప్రపంచశాంతికి ఒక సందేశమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు చెప్పారు. పట్టణంలోని భావనరుషినగర్‌లో ఉన్న తండ్రి సన్నిధి, పురుషోత్తమపట్నం బైపాస్ రోడ్డులో ఉన్న ఏసు క్రీస్తు దివ్యశాంతి నిలయం చర్చిల్లో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ ఏసుక్రీస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున హాజరైన క్రైస్తవులు, విశ్వాసులను ఉద్దేశించి రాజేష్ నాయుడు మాట్లాడుతూ క్రీస్తు ప్రబోధాలను ఆచరించటమే నిజమైన క్రిస్మస్ అని చెప్పారు. లోక రక్షకుడు ప్రజలను పాపాల నుంచి రక్షించేందుకే జన్మించాడన్నారు. సత్యం, ధర్మం, శాంతి, సహనాలను ఏసుక్రీస్తు ప్రపంచానికి అందించారని పేర్కొన్నారు. ధర్మం కోసం అడుగులు వేసే ఎవరైనా సత్యాన్ని నిర్భయంగా ప్రకటిస్తారనేది క్రీస్తు జీవితం ద్వారా మనకు తెలుస్తోందని వెల్లడించారు. క్రీస్తు చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించి ప్రపంచశాంతికి, సర్వమానవాళి సౌభ్రాతృత్వానికి పాటు పడాలని పిలుపు నిచ్చారు. తన కుటుంబం నియోజకవర్గంలో చర్చిల నిర్మాణానికి అందించిన సహకారాన్ని గుర్తు చేసుకున్నారు. తండ్రి సన్నిధిలో పాస్టర్ షాలేమురాజు, శాంతి నిలయంలో పాస్టర్ నందమూరి క్రిస్టర్‌లు ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో పంగులూరి వెంగళరాయుడు, బండారు జయకుమార్, మైలా రాజేష్, కంచెర్ల సునీత, దాసరి మర్దు, పుల్లగూర భరత్, బొంతా రమణయ్య, కొచ్చెర్ల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



యడ్లపాడు దిగువ ఎస్సీకాలనీలోని ఆర్‌సీఎం చర్చిలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఫాదర్ సుభాష్



యడ్లపాడు కొండపై చర్చిలో ఆరాధనకు హాజరైన విశ్వాసులు



యడ్లపాడు పైపల్లెలోని లూథరన్ చర్చిలో క్రిస్మస్ విశిష్టతను తెలుపుతున్న పాస్టర్ ఏసురత్నం



నూజెండ్లలో క్రైస్తవ గీతాలను ఆలపిస్తున్న చిన్నారులు



రొంపిచర్ల హోసన్నా మందిరంలో క్రీస్తు జననంపై పాటలతో నృత్యం చేస్తున్న బాలికలు

మాజీ ప్రధాని వాజ్‌పేయి మేరునగధీరుడు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్

నరసరావుపేట: ప్రస్తుత రాజకీయ నాయకుల వ్యక్తిత్వంలో దివంగత మాజీ దేశ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి మేరు నగధీరుడని, ఆయన జీవితం, వ్యక్తిత్వం, నడవడిక ప్రతి ఒక్కరికీ ఆదర్శమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రంగిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో భారతరత్న వాజ్‌పేయి జయంతి వేడుకలను నిర్వహించారు. పల్నాడు రోడ్డులోని వివేకానంద విగ్రహం, మోర్‌సెంటర్‌లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. దేశ అభివృద్ధికి జాతీయ రహదారులు కీలకమని స్వర్ణ చతుర్భుజీ పేరుతో దేశమంతటా జాతీయ రహదారులను ఏర్పాటు చేశారని చెప్పారు. పోఖ్రాన్‌లో అణు పరీక్షలు నిర్వహించి దేశాన్ని శత్రు దుర్భేద్యంగా మలిచి అగ్రదేశాల సరసన నిలబెట్టిన ధీశాలని కొనియాడారు. రాష్ట్ర పదాధికారి పునుగుళ్ల రవి శంకర్ మాట్లాడుతూ నాడు 13 నెలలు ప్రధానిగా కొనసాగి అవిశ్వాస తీర్మానం ఎదుర్కొన్న సమయంలో ఒక్క ఓటు తేడాతో అధికారం దూరమవుతుందని తెలిసినా నైతిక విలువలకు కట్టుబడిన ధీశాలని, ఆయన తన జీవితాన్ని దేశం కోసం అంకితం చేశారన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పూర్వ అధ్యక్షులు వల్లెపు కృపారావు, సీనియర్ నాయకులు మేడికొండ కబ్బిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మెడికొండ సత్యానంద్ బాబు, జిల్లా కార్యదర్శి చిరుమామిళ్ళ ఆదినారాయణరావు, కార్యకర్తలు అభిమానుల పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): మాజీ ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పాయి జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానిగా దేశానికి ఎన్నో సేవలు అందించారని, స్వర్ణ చతుర్భుజ పథకం కింద దేశంలోని రహదారులన్నీ జాతీయ రహదారులుగా మార్చి ఐక్యం చేశారని నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నల్లూరి వీరరాఘవులు, మేడం రమేష్, గుడిపాటి చంద్రం, రాజు, జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



నరసరావుపేటలో వాజ్‌పేయి చిత్రానికి పూలు చల్లుతున్న నాయకులు



వినుకొండలో అన్నదానం చేస్తున్న బీజేపీ నాయకులు

అయ్యప్పస్వామి ఆలయంలో ఎంపీ పూజలు



అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

చిలకలూరిపేట: మండలంలోని ఓగేరువాగు దక్షిణాన ఉన్న అయ్యప్పస్వామి దేవస్థానంలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వహిస్తున్న మండల మహోత్సవాలలో పాల్గొనాలన్న ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు సోమవారం ఎంపీ ఆలయాన్ని సందర్శించారు. ఆయనకు ఆలయ కమిటీ అధ్యక్షుడు వెల్లంపల్లి రవిశంకర్, కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనానంతరం అర్చక స్వాములు ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా పక్కనే ఉన్న ఓగేరువాగులో భక్తులు స్నానమచరించే విధంగా వసతి కల్పించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరగా, ఎంపీ సానుకూలంగా స్పందించారు. ఆయన వెంట అధికారభాష సంఘం సభ్యుడు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు, ఆలయన కమిటీ కోశాధికారి పెన్నా సాంబశివరావు, నాయుడు రమేష్, గుడిపూడి దశరధరామయ్య తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగానికి కొత్తసారథులు



లేళ్ల అంజిరెడ్డి



కోట శివకుమార్

వినుకొండ(నూజెండ్ల) : వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నూజెండ్ల మండలం తలార్లపల్లి గ్రామానికి చెందిన లేళ్ల అంజిరెడ్డి నియమితులయ్యారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి లేళ్ల అంజిరెడ్డిని నియమిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా లేళ్ల అంజిరెడ్డిని స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మండల కన్వీనర్ నాగిరెడ్డిలతో పాటు పలువురు నియోజకవర్గ నాయకులు అభినందనలు తెలియజేశారు.

కార్యదర్శిగా కోట శివకుమార్

పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం కార్యదర్శిగా కోట శివకుమార్ నియమితులయ్యారు. రాష్ట్ర వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ నుంచి నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు, పార్టీ నాయకులకు శివకుమార్ ధన్యవాదాలు తెలిపారు.

పౌరాణిక పద్యనాటక పోటీలు

వినుకొండ(నూజెండ్ల): క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో జీవన జ్యోతి సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జాషువా కళాప్రాంగణంలో పౌరాణిక పద్య నాటక పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రదర్శించిన సత్యహరిశ్చంద్ర నాటకం ప్రేక్షకులను అలరించింది.

